రాజ్యసభలో బీఆర్ఎస్ ఉపనేతగా వద్దిరాజు

- విప్‌గా దీవకొండ దామోదర్‌రావు
- కేసీఆర్‌కు ఎంపీల కృతజ్ఞతలు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్‌గా ఎంపీ వద్దిరాజు రవిచంద్రను, విప్‌గా ఎంపీ దీవకొండ దామోదర్‌రావును పార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. ఈ మేరకు ఆయన పార్లమెంట్ సెక్రటరీ జనరల్‌కు లేఖ రాశారు. పార్లమెంటరీ పార్టీనేతగా ఇటీవలే ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి నియమితులు కావడం తెలిసిందే. కాగా, పార్లమెంటరీ పార్టీ ఉపనేతగా, విప్‌గా నియమించినందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ దిశానిర్దేశానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు పార్లమెంట్ వేదికగా తమ శక్తియుక్తులను వినియోగిస్తామని పేర్కొన్నారు.

సీఎం అంటే కటింగ్ మాస్టరా?

- ప్రతి పథకంలోనూ కోతలేనా?
- రుణమాఫీలోనూ కొర్రీలేనా?
- మాట తప్పినా, మడమ తిప్పినా ప్రశ్నిస్తాం: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పథకంలోనూ కోతలు పెడుతుండటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'సీఎం అంటే కటింగ్ మాస్టరా?' అంటూ ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా నిలదీశారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రతి పథకంలోనూ సవాలక్ష కొర్రీలు, కోతలు పెట్టి ఎవరికి ప్రయోజనం కలిగిస్తున్నారని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి గారూ.. సీఎం అంటే 'కటింగ్ మాస్టరా'? ప్రతి పథకంలో లబ్ధిదారుల సంఖ్యకు కోత పెట్టడమే లక్ష్యమా? సీఎం అనే పదానికి ఇదే సరికొత్త నిర్వచనమా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. 'నాడు.. పరుగుపరుగున వెళ్లి రైతులను లోన్ తెచ్చుకోమన్నారు. నేడు రూ.2 లక్షల రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. మొదలు రూ.39 వేల కోట్లు అని, ఇప్పుడు రూ.31 వేల కోట్లకు కటింగ్ పెట్టి కుదించారు. పాసుబుక్కులు లేవనే నెపంతో లక్షల మందికి శఠగోపం పెట్టే కుటిల ప్రయత్నం చేస్తే సహించం. రేషన్‌కార్డు సాకు చూపి లక్షల మందికి మొండిచెయ్యిచ్చే కుతంత్రం చేస్తే భరించం. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని కొందరికి, చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని మరికొందరికి శూన్యహస్తం చూపే చీకటి పన్నాగాన్ని చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. మొన్న.. లక్షలాది మందిని రూ.500 సిలిండర్ పథకానికి దూరం చేశారు. నిన్న 200 యూనిట్ల పథకానికి ఆంక్షలు పెట్టి ఆగమాగం చేశారు. నేడు రూ.2 లక్షల రుణమాఫీని కూడా ఎగ్గొట్టి లక్షలాది రైతులకు ఎగనామం పెడతామంటే కుదరదు. నాట్ల నాడు ఇవ్వాల్సిన రైతుబంధు ఇప్పటికీ దిక్కులేదు. ఓట్ల పండగ ముగిసినా ఎకరానికి రూ.7,500 రైతుభరోసాకు అడ్రస్సే లేదు. కాంగ్రెస్ ప్రచారంలో 'అందరికీ అన్నీ' అన్నారు. అధికారంలోకి రాగానే 'కొందరికే కొన్ని' అని కోతపెడుతున్నారు. రుణమాఫీపై మాట తప్పినా, మడమ తిప్పినా, లక్షలాది రైతు కుటుంబాల తరపున ప్రశ్నిస్తాం, పోరాడుతాం. జై కిసాన్ జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. దీనికి నెటిజన్ల నుంచి విశేష స్పందన వస్తున్నది. వేలాది వ్యూస్, కామెంట్లు వస్తున్నాయి. 'సీఎం అంటే కటింగ్ మాస్టరే కాదు.. పెద్ద కన్నింగ్ మాస్టర్ కూడా' అంటూ కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

'ఫ్లైయాష్'లో పైసలు తీసుకోలేదని ప్రమాణం చేస్తవా?

- బుధవారం జూబ్లీహిల్స్‌లోని గుడికి వస్తా
- మీడియా సమక్షంలో ఒట్టు చేస్తవా?
- మంత్రి పొన్నంకు ఎమ్మెల్యే పాడి సవాల్
- 3 నెలల పింఛన్లు ఎందుకు ఆపారు?
- పింఛన్ల పంపిణీపై సీఎంకు బహిరంగ లేఖ
- కల్యాణలక్ష్మి చెక్కులు ఎందుకు ఆపారు?
- ప్రొటోకాల్ లేకపోతే హైకోర్టుకు వెళ్తా
- హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఫైర్

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే సంజయ్

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్టీపీసీ ఫ్లైయాష్ రవాణాలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డబ్బులు తీసుకోకపోతే హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణానికి సిద్ధమా? అని బీఆర్ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నెల 26న ఉదయం 11 గంటలకు తాను ఆలయానికి వస్తానని, పొన్నం వచ్చి డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేస్తే తాను బహిరంగ క్షమాపణలు చెప్పి ముక్కునేలకు రాస్తానని తెలిపారు. ఒకవేళ ఆ రోజు పొన్నం.. ఆలయానికి రాకపోతే మరిన్ని నిజాలు బయటపెడతామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్, పార్టీ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తిరుమల వేంకటేశ్వరస్వామి భక్తుడు కాబట్టి, తాను కూడా శ్రీవారి భక్తుడిని కాబట్టి ప్రమాణంపై సవాల్ విసురుతున్నట్టు చెప్పారు. ఫ్లైయాష్ రవాణా అంశంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. లీగల్ నోటీసులు ఇవ్వటంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఇల్లీగల్ నోటీసులకు తమ లీగల్ టీమ్ సమాధానం చెప్తుందని పేర్కొన్నారు. అధిక లోడ్‌తో లారీలు నడపవచ్చా? రవాణా మంత్రిగా పొన్నం ప్రభాకర్ సమాధానం చెప్పాలి? అని నిలదీశారు. 34 టన్నులతో వెళ్లాల్సిన ఫ్లైయాష్ లారీలు 84 టన్నులు మోసుకెళ్తున్నాయని, నేటికీ ఓవర్ లోడ్‌తో రవాణా యథేచ్ఛగా సాగుతున్నదని తెలిపారు. మంత్రి పొన్నం ప్రమేయం లేకపోతే ఓవర్ లోడ్ లారీలపై చర్యలు ఎందుకు తీసుకోవటం లేదు? అని నిలదీశారు.

ఒకరిద్దరు వెళ్తే నష్టమేమీ లేదు

పార్టీలో పదవులు, అధికారం అనుభవించి నలుగురు వెళ్లిపోయినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టమేమీలేదని కౌశిక్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్‌కు 34 మంది ఎమ్మెల్యేలు, 28 మంది ఎమ్మెల్సీలు, నలుగురు రాజ్యసభ సభ్యులు, వందల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, లక్షల్లో కార్యకర్తలు పార్టీకి సైన్యంగా ఉన్నారని చెప్పారు. కేవలం ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్, యువనేతలు కేటీఆర్, హరీశ్‌రావు, లక్షల్లో గులాబీ సైన్యం ఉన్న తమ పార్టీ తిరిగి కచ్చితంగా అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తంచేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను విడిచిపెట్టబోమని, వారి లొసుగులన్నీ బయటపెడతామని హెచ్చరించారు. పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదు అనే విషయం ప్రతి ఎమ్మెల్యే గుర్తు పెట్టుకోవాలి సూచించారు. ఇప్పుడు వెళ్లిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీలో చేర్చుబోమని స్పష్టంచేశారు.

6నెలల బకాయిలతోపాటు 9 నెలల పింఛన్లు ఇవ్వాలి

ఇంట్లో అవ్వ, తాతకు పింఛను పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మూడు నెలల పింఛన్లు ఇవ్వకుండా ఆపారని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. డిసెంబర్, ఏప్రిల్, మే నెలల పింఛన్ మొత్తాన్ని ఆపటం వల్ల పింఛన్లపై ఆధారపడిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతులు ఎలా జీవనం సాగిస్తారని నిలదీశారు. డిసెంబర్ నుంచే పెంచుతామన్న పింఛన్‌ను అమలుచేసి ఆరునెలల బకాయిలతోపాటు మొత్తం 9 నెలల మొత్తం పింఛను చెల్లించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాసినట్టు చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఇద్దరికీ పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలయ్యేదాకా ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూనే ఉంటామని స్పష్టంచేశారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ప్రొటోకాల్ పాటించాలని తన నియోజకవర్గంలోని ఎమ్మార్వోలకు లేఖరాసినా మంత్రి హాజరవుతారని చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆపుతున్నారని మండిపడ్డారు. ఈ నెల 27న కల్యాణలక్ష్మి చెక్కుల కాలపరిమితి ముగుస్తుందని వెల్లడించారు. కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం ఇవ్వాలని ప్రజలు ఎక్కడ అడుగుతారోనని భయపడుతున్నారా? అని కాంగ్రెస్ సర్కారును నిలదీశారు. హుజూరాబాద్‌లో ఎమ్మెల్యేకు ఒక్క కల్యాణలక్ష్మి చెక్కు కూడా ఇవ్వొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్.. ఆర్డీవో, ఎమ్మార్వోలకు హుకుం జారీచేశారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన ఫోన్ రికార్డును మీడియాకు వినిపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే చెక్కులను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అధికారులు నిబంధనల ప్రకారం చెక్కులు పంచకపోతే హైకోర్టుకు వెళ్తానని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న అధికారుల పేర్లు బ్లాక్ బుక్‌లో రాస్తున్నానని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆ అధికారులకు బ్లాక్‌డేస్ ఉంటాయని హెచ్చరించారు.

కరీంనగర్‌లోని క్యాంపు ఆఫీసులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సింగరేణి వేలానికి కాంగ్రెస్, బీజేపీ కుట్ర

- బొగ్గు గనులను ప్రైవేట్‌కు అమ్మితే ఊరుకోం

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరిక

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి సింగరేణిని ఖతం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని, అందులో భాగంగానే బొగ్గు గనులను అమ్మకానికి పెట్టాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పది రోజుల్లోనే కిషన్‌రెడ్డి సొంత రాష్ట్రానికే ద్రోహం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రధాని మోదీకి లేఖ రాసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎందుకు లేఖ రాయడంలేదని ప్రశ్నించారు. బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తున్నామంటూ మీడియా ముందు ప్రగల్భాలు పలికిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఏ ముఖం పెట్టుకొని వేలంలో పాల్గొంటున్నారని నిలదీశారు. ఆదివారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కొప్పుల మీడియాతో మాట్లాడారు. లక్షల మంది జీవితాలతో ముడిపడి ఉన్న సింగరేణిని కేసీఆర్ రక్షించారని, కేంద్రం ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా ప్రైవేట్‌పరం చేసేందుకు ఒప్పుకోలేదని గుర్తుచేశారు. ఉమ్మడి పాలనలో నష్టాల్లో ఉన్న సింగరేణిని లాభాల బాట పట్టించిన ఘనత ఆయనకే దక్కిందని చెప్పారు. ఆరు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మిక సంఘాలు స్పందించి బీఆర్ఎస్ చేసే పోరాటంలో కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, గంగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాట్నపల్లి రైస్‌మిల్లులో హత్యకు గురైన చిన్నారికి నివాళులర్పిస్తూ పెద్దపల్లిలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హోంమంత్రి లేని రాష్ట్రంగా తెలంగాణ

- బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కాట్నపల్లిలో హత్యకు గురైన బాలికకు పెద్దపల్లిలో కొవ్వొత్తులతో నివాళి

పెద్దపల్లి, జూన్ 23: దేశంలోనే హోంమంత్రి లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. అందుకే రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పుతున్నాయని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో హత్యకు గురైన చిన్నారికి నివాళులర్పిస్తూ పెద్దపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరేండ్ల బాలికపై లైంగికదాడి చేసి హత్యచేయడం బాధాకరమని అన్నారు. చిన్నారి హత్యపై హోంశాఖను అట్టిపెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇంతవరకు స్పందించపోవడం సిగ్గుచేటని అన్నారు. కేసీఆర్ పాలనలో పోలీస్ వ్యవస్థను పటిష్టపరిస్తే.. రేవంత్ సర్కార్ చిన్నాభిన్నం చేసిందని దుయ్యబట్టారు. ఇటీవల భూపాల్‌పల్లి జిల్లా మహాదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్‌పై ఎస్సై రివ్వాల్‌ర్ చూపి లైంగికంగా వేధించడం, సుల్తానాబాద్ మండలంలో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. చిన్నారి హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు ఊరి శిక్ష వేయాలని కోరారు.

రేవంత్.. రియల్ ఎస్టేట్ మనస్తత్వాన్ని విడిచిపెట్టు

- ఏపీతో సమానంగా పనిచేస్తామని చెప్పి సీఎం తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ మనస్తత్వాన్ని విడిచిపెట్టి ప్రజల సంక్షేమాన్ని కోరుకునే విశాల దృక్పథం ఉన్న నాయకుడిగా మారాలని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ సూచించారు. 'ఏపీతో సమానంగా పనిచేస్తాం' అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించి తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారని ఆదివారం ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. తెలంగాణ ప్రతి అభివృద్ధి సూచీలో ముందున్నదని, ఆరోగ్యసూచీలో ఎంతో ముందున్నదనే విషయాన్ని సీఎం తెలుసుకోవాలన్నారు. అదే సమయంలో ప్రభుత్వ రంగంలో బలమైన గ్రామీణ ఆరోగ్య సంరక్షణ అవసరం ఉన్నదని చెప్పారు. కార్పొరేట్ హాస్పిటళ్ల లైసెన్స్ దోపిడీని నియంత్రించకుండా ముఖ్యమంత్రి ఆరోగ్య పర్యాటకం పేరుతో మరిన్ని కార్పొరేట్ హాస్పిటళ్లను ప్రోత్సహించేందుకు వేల ఎకరాల విలువైన భూములను కేటాయిస్తామని పేర్కొనటం వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపార కోణం దాగి ఉందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని పేర్కొన్నారు.

కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేతల భేటీ

- పార్టీ మారే ప్రసక్తేలేదు: గంగుల, కృష్ణమోహన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో ఆదివారం పలువురు బీఆర్ఎస్ నేతలు భేటీ అయ్యారు. తమ జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను ఈ సందర్భంగా వారు ఆయనకు వివరించారు. త్వరలోనే సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించి, అందుకు అనుగుణమైన కార్యాచరణను అమలు చేస్తామని తనను కలిసిన నేతలకు కేసీఆర్ చెప్పారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని, ఈ విషయంలో ఎంతవరకైనా పోరాటం చేస్తామనే విషయాన్ని కేసీఆర్ స్పష్టం చేశారని పార్టీ నేతలు తెలిపారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహా పలువురు నేతలు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఇటీవల గంగుల కమలాకర్, కృష్ణమోహన్‌రెడ్డి పార్టీ మారుతున్నారన్న ప్రచారంపైనా వారు స్పందించారు. తాము పార్టీ మారే ప్రసక్తేలేదని, తమ నాయకుడు కేసీఆరేనని ఈ సందర్భంగా గంగుల కమలాకర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. కరీంనగర్ నగర మేయర్, డిప్యూటీ మేయర్ సహా పార్టీ కార్పొరేటర్లతో తమ అధినేత కేసీఆర్‌ను కలిశామని గంగుల తెలిపారు. పార్టీ మారుతున్నారంటూ కావాలనే తమపై ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లు

- నమూనాలను పరిశీలించిన సీఎం

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ పాఠశాలలకు దీటుగా రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లను నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుపై ఆదివారం ఆయన తన నివాసంలో సమీక్షించారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సీఎస్ శాంతికుమారి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. క్యాంపస్‌ల నిర్మాణానికి ఆర్కిటెక్టులు రూపొందించిన పలు నమూనాలను పరిశీలించారు. నాణ్యమైన విద్యాబోధనకు వీలుగా తరగతి గదులతో పాటు విద్యార్థులకు అన్ని వసతులు ఉండేలా అధునాతన భవనాలు నిర్మించాలని సీఎం సూచించారు. అందుబాటులో ఉన్న స్థలాలకు అనుగుణంగా నమూనాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

రమణ్‌సింగ్‌కూ నోటీసులివ్వాలి

మొదటిపేజీ తరువాయి...

విషయాన్ని కమిషన్‌కు సూచిస్తానని చెప్పారు. కమిషన్ నివేదిక ఇవ్వకముందే గత ప్రభుత్వ నిర్ణయాలతో రూ.6వేల కోట్ల నష్టమని కొన్ని పత్రికలకు లీకులు ఇచ్చిందెవరు? అందులో వారి పాత్ర ఏమిటి? వంటి విషయాలు బయటికి రావాలని, ఇందుకోసం సదరు పత్రికలను కూడా కమిషన్ విచారించాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డితోకలిసి ఆయన మీడియా తో మాట్లాడారు. ఈ సందర్భంగా తనకు జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ నుంచి పిలుపు వచ్చిందని, తాను హాజరై కమిషన్‌కు సహకరిస్తానని చెప్పారు. విద్యుత్తు కొనుగోలు, ఒప్పందాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నదని, ప్రజలకు నిజానిజాలు తెలియాలనే ఉద్దేశంతో తామే విచారణకు అసెంబ్లీసాక్షిగా డిమాండ్ చేశామని గుర్తు చేశారు. జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ నిజ నిర్ధారణకు రావాలంటే నాటి వ్యవహారాల్లో అన్నిపక్షాల వాదనలు వినాలని కోరారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ చంద్రశేఖర్‌రెడ్డి

కమిషన్‌కు అన్ని విషయాలూ వెల్లడిస్తా

జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డికి కమిషన్ నుంచి తనకు ఉత్తరం అందిందని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ, జెన్‌కో అధికారులు, బీహెచ్ఈఎల్ సహా ఇతర సంస్థల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరిస్తూ, తనకు వచ్చిన అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకొని అన్ని విషయాలూ వెల్లడిస్తానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంపై బురదజల్లటమే పనిగా పెట్టుకున్న వ్యక్తులు, శక్తుల ప్రయత్నాలను కమిషన్‌కు వివరిస్తానని చెప్పారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో భాగమైన సంస్థలు, బాధ్యులను విచారణలో భాగస్వామ్యం చేయాలని, నాటి ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్‌ను విచారణకు పిలవాల్సిన అవసరముందని చెప్పారు. ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఇటు నుంచి అప్పటి సీఎం కేసీఆర్‌ను విచారణకు రావాలని చెప్పి, సమాచారం సేకరించినప్పుడు అటునుంచి కూడా ఏం జరిగిందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందనే విషయాన్ని కమిషన్‌కు సూచిస్తానని చెప్పారు. ఈఆర్‌సీపై విచారణ చేస్తున్నప్పుడు ఎన్‌జీటీని విచారించే పరిధి ఉందా? లేదా? ఉంటే వాళ్ల ను కూడా విచారణకు పిలవాలనే విషయాన్ని కమిషన్‌కు నివేదిస్తానన్నారు.

పత్రికలకు లీకులిచ్చిందెవరు?

విచారణ సమయంలోనే జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఈనెల 11న 'ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో నష్టం జరిగింది.. లెక్కలు కట్టడమే తరువాయి' అన్నట్టుగా వ్యాఖ్యానించిందని జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆ వ్యాఖ్యలకు బలం చేకూరేలా కొన్ని ప్రధాన పత్రికల్లో ప్రధాన శీర్షికగా రూ.6000 కోట్ల నష్టం జరిగిందని వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆ పత్రికలకు కూడా నోటీసులిచ్చి విచారణకు పిలవాలని తాను కమిషన్ ముందు పెడతానన్నారు. ఏ ఆధారంతో వార్తలు రాశారో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. 7వేల కోట్ల చెల్లింపులు జరిగాయని, అందులో 6వేల కోట్లు దుర్వినియోగమయ్యాయని పేర్కొనటం గత ప్రభు త్వ ప్రతిష్టకు ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించే చర్యేనని తాను కమిషన్‌కు చెప్తానన్నారు. అన్ని కోణాల్లో విచారణ చేస్తేనే అసలు విషయాలు బయటికొస్తాయని, అలా చేయకపోతే ఏకపక్షంగా అవుతుందని, నిర్దేశిత తీర్పును ఇచ్చి బద్నాం చేయాలనుకుంటే గౌరవంగా విచారణ నుంచి తప్పుకోవాలని సలహా కూడా ఇస్తామన్నారు.

ఈనెల చివరికల్లా పెట్టుబడిసాయం ఇవ్వాలి

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): రైతులకు ఇప్పటికే పెట్టుబడిసాయం ఇవ్వాల్సి ఉందని, కనీసం ఈనెలాఖరు వరకైనా వేయాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుభరోసా ప్రారంభమైందని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించారని, ప్రారంభమైన కార్యక్రమ విధివిధానాల కోసం మంత్రివర్గ ఉపసంఘం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతులు ఎంతమంది ఉన్నారు? వారికి ఉన్న భూమి ఎంత? తదితర విషయాలన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయని ఈ క్రమంలో ఇంకా తేలాల్సింది ఏమిటని ప్రశ్నించారు. ఏకకాలంలోనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

వారం రోజుల్లో వివరణ ఇవ్వండి

- జగదీశ్‌రెడ్డికి జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ లేఖ

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు కొనుగోళ్ల వ్యవహారంపై వివరణ ఇవ్వాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ లేఖను పంపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ సెక్షన్లు 80(బీ), 80(సీ) ప్రకారం ఏదైనా వివరణ ఇవ్వదల్చుకుంటే వారం రోజుల్లో ప్రత్యక్షంగా లేదా లేఖ ద్వారా ఇవ్వాలని ఆ లేఖలో జగదీశ్‌రెడ్డికి సూచించింది. అవసరమైతే క్రాస్ ఎగ్జామినేషన్‌కు సైతం అవకాశమిస్తామని స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్తుతోపాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంపై విచారణ జరిపేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డితో ఏకసభ్య సంఘాన్ని నియమించిన విషయం తెలిసిందే. గత 3 నెలల నుంచి విచారణ జరుపుతున్న ఈ కమిషన్ ఇప్పటివరకు 25 మందికి లేఖలు రాసింది. 24 మంది ఐఏఎస్‌లతోపాటు మాజ